# మానవత్వం పరిమళించిన వేళ

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. అశోక్ నగర్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఓ సాహిత్యసభకి వెళ్ళాను. ఈ సభలో ఎప్పుడూ అన్న టైముకి మొదలు పెట్టరు. ఆలస్యంగా ప్రారంభమైన సభ ఆలస్యంగానే ముగిసింది. అసలే హైదరాబాదు. అందునా రాత్రి తొమ్మిది గంటలు దాటింది. మీటింగ్‌కి వచ్చిన అందరూ హడావుడిగా కిందకి దిగివస్తూనే కొందరు స్కూటర్‌లలోనూ కొందరు కార్లలోనూ కొందరు జట్లు జట్లుగా నడిచివెళ్ళిపోతున్నారు.

నాకు కాస్త పరిచయంఉన్న భగవతిని లిఫ్ట్ అడగుదాం అని ఆమె దగ్గరగా వెళ్ళేను. ఆవిడ నన్ను చూడనట్లుగా కారులో కూర్చుని వెళ్లిపోయింది. ఆవిడ మా ఇల్లుదాటి ఇంకా పైకి వెళ్ళాలి. వాచీ చూసుకున్నాను. తొమ్మిదిన్నర అయింది. చుట్టూ చూశాను. పరిచయస్తులెవరూలేరు.

ఇల్లు గుర్తుకి వచ్చింది. పిల్లలు ఆకలితో యేడ్చి నిద్రపోయి ఉంటారు. నిద్రపోయే టైముకయినా నేను ఇల్లు చేరనందుకు శ్రీవారు చిందులేస్తుంటారు. శ్రీవారు 'నియంత' కాదుకానీ యెక్కడి కెళ్లినా రాత్రి తొమ్మిదీ తొమ్మిదిన్నర లోపల ఇల్లుచేరాలి.

అసలే కాలం బాగాలేదు అని చాలాసార్లు వార్నింగ్ ఇచ్చారు. సామాన్యంగా ఏ సాహిత్య సభకు వెళ్లినా వాచీ చూసుకుంటూనే అతిముఖ్యులైన వక్తల ఉపన్యాసాలు అయి అవగానే లేచి ఆటోలోనో, బస్‌లోనో ఇల్లు చేరతాను. ఇవాళ ఎందుకో టైము చూసుకోలేదు. అంటే వక్తలు తమ ఉపన్యాసంతో ప్రేక్షకులను కాలాన్ని తెలియనీయలేదు అన్నమాట.

ఇలా జరగటం చాలా అరుదు. అందుకే నన్ను నేను మరిచిపోయాను. కానీ వాచీ చూసుకుంటే గుండె గుభేల్‌మంది.. చకచకా నడుచుకుంటూ సుధాహోటల్ వరకూ వచ్చినా ఒక్క ఆటో దొరకలేదు. ఒక్క రిక్షా దొరికినా నారాయణగూడా వరకూ వెళ్లి అక్కడనుంచి సిటీబస్ ఎక్కవచ్చు. కానీ అలావెడితే ఇంకా చాలా టైము పడుతుంది. దిక్కులు చూస్తూ నిల్చున్నాను. ఓ ఇరవై నిమిషాల తర్వాత ఓ ఆటో వచ్చింది.

"పంజాగుట్ట బాబూ" అన్నాను ఆటోదగ్గరగా వెళ్ళి..

"రాను" అన్నట్లుగా తల వూపి కాస్త దూరం వెళ్ళి ఆటో ఆపి కూర్చున్నాడు.

"హైదారాబాద్ ఆటోవాళ్ళు ఎప్పుడూ ఇంతే" కోపంగా అనుకొంటూ ఉండగా వస్తూన్న మరో ఆటోని ఆగమన్నా ఆగకుండా వెళ్లిపోయింది. అలా ఒకటి కాదు నాలుగు వెళ్లిపోయాయి. టైము పదిగంటలు కావస్తోంది. గుండె దడ ప్రారంభమైంది.

షాపులు ఒక్కోటీ మూసేస్తున్నారు. రోడ్డుమీద జనం పల్చబడ్డారు.

ఛీ ఈ మీటింగ్‌కి రాకున్నా బాగుండిపోయేది. నన్ను నేను అప్పటికి వందసార్లన్నా తిట్టుకున్నాను. ఇంతలో ఓ ఆటో వచ్చి నాదగ్గరాగింది. నా ప్రాణం లేచివచ్చినట్లు అయింది. ఆటోలోకి చూస్తూ అడిగాను "పంజాగుట్ట వెళ్ళాలి బాబూ" అని.

డ్రైవర్ పక్కన ఇద్దరు యువకులు ఇరుక్కుని కూర్చుని నన్ను చూసి ఇకిలిస్తున్నారు.

"అయిదు రూపాయలు ఎక్కువ ఇవ్వాలి" ఇంతలో అంత క్రితం ఆగి వున్న ఆటో వచ్చేసింది.

ఆటో దిగిన కుర్రాడు "ఏంటి బే" అంటూ ముందుకు రాబోయాడు.

అతడు అతన్ని చేత్తో విసురుగా నెట్టాడు.

నేను ఇంకేం ఆలోచించకుండాఈ ఆటో ఎక్కేశాను. ఆటో స్పీడందుకుంది.

"పంజాగుట్ట" అన్నాను పొడారిపోతున్న పెదవులని తడిచేసుకుంటూ.

ఆ కుర్రాళ్ళువెనకగా గోలచేయటం విన్పించింది కాసేపు.

ఈ ఆటో డ్రైవర్‌కి దాదాపు యాభైయేళ్లు ఉన్నట్లున్నాయి. ఇతను చాలాసేపటి నుంచీ ఆటోకోసం నేను నిలబడటం ఆకుర్రాళ్ళు ముగ్గురూ సంగీతాలు పాడటం అన్నీ గమనిస్తున్నాడన్పించింది. ఏది ఏమైనా అర్ధగంటలోఇల్లు చేరగలను అన్న ధైర్యం వచ్చేసింది. ఫ్లై ఓవర్ మీద నుంచి ఆటో స్పీడుగా పోతూవుంది. నీళ్ళమీద నుంచి

చల్లటిగాలి వీస్తున్నా నాకింకా చెమట పడుతూనే వుంది. ఆ దారిలో అప్పుడోటీ అప్పుడోటీ కార్లూ ఆటోలూ రైయ్ రైయ్‌మని వస్తూ పోతున్నాయి. అవి అలా వస్తున్నప్పుడు ధైర్యం, వెళ్ళిపోతూంటే భయం. ఈరోజు నా అవస్థకి నామీద నాకే కోపం వస్తోంది. అయినా ఇల్లునీ పిల్లలనీ చూసుకుంటూ పడివుండకనాకెందుకీ సాహిత్యసభల పిచ్చి నేనేమన్నా రచయిత్రినా పాడా. చదవాలన్న తాపత్రయం తప్ప చదివినవి బాగున్నాయని అన్పించినా పత్రికలకి ఉత్తరాలు రాసే అలవాటు కూడా లేనిదాన్ని ఎక్కడ ఏ మంచి పుస్తకం దొరకుతుందన్నా డబ్బుపెట్టి కొనటం తిండీ నిద్రమాని చదివేయటం ఎక్కడ ఏ సాహిత్య సభ జరుగుతుందని తెల్సినా ఆటోలో వెళ్ళి వస్తూ డబ్బు తగలేస్తూంటాను. ఎందుకు?

సాహిత్యమంటే నాకు ప్రాణం. దాన్ని గురించి తెల్సుకోవటం నా హాబీ. ఈ హాబీ ఎలా ఏర్పడిందంటే నా చిన్నప్పుడు మా పొట్టిపంతులు అనే తెలగుమాష్టారు చెప్పిన మాటలు కొన్ని ఇప్పటికీ గుర్తుండిపోయాయి.

"నిజం చాలా అరుదైనది. అంచేత దాన్ని పొదుపుగా వాడుకోమన్నాడు ఓ ఇంగ్లీషు రచయిత."

"ఒక పుస్తకం చదవటంకన్నా ఎన్నో పుస్తకాలు చదివి మరొకరికి చెప్పగలిగిన వక్తలు చెప్పేది వింటూ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు" అని ఇలా మా పొట్టి పంతులుగారు క్లాసులో క్లాసు పుస్తకాలలోని పాఠాలేకాక ఎన్నెన్నో విషయాలు చెప్తుండేవారు. ఆయన చెప్పిన అన్ని విషయాల్లో నాకు బాగా గుర్తున్నవి ఈ రెండు విషయాలూ. అందువల్లనేమో నాజీవితంలో ఒకభాగం ఈ సాహిత్య సభలకి వెళ్ళటం రావటం వక్తలు చెప్పిన విషయాలని మననం చేసుకోవటం చాలాచాలా ఇష్టం. ఈ ఇష్టంలో ఉన్న ఆనందం మాటల్లో వక్తీకరించటానికి నా దగ్గర భాష లేదు.

ఆటో ఆగిపోయింది. నా ఆలోచనలూ ఆగిపోయాయి. తిరిగి నా గుండె కొట్టుకోసాగింది. ఆటో డ్రైవర్ వెనక్కి వెనక్కి తిరిగి చూస్తున్నాడు.

నాకూ ఏదో అనుమానం వచ్చి తలతిప్పి చూశాను. కాస్త దూరంలో ఆ ముగ్గురూ ఉన్న ఆటో కన్పించింది. అందులోనుంచి నవ్వులూ కేకలూ విన్పిస్తున్నాయి. అంటే చిక్కడపల్లిలోని ఆటోవాళ్ళు మనల్ని వెంబడిస్తూ వస్తున్నారా! భగవాన్! నాకాళ్ళూ చేతులూ చల్లగా అయిపోయినట్లు అన్పించ సాగింది.

'రేయ్ బద్మాష్లారా!" అంటూ పెద్దగా కేకపెట్టి ఆటోని స్పీడు పెంచాడు నా ఆటో డ్రైవర్. వెనక ఆటో శబ్దం విన్పించలేదింక.

మరో పదిహేను నిమిషాల్లోనే ఆటో ఎర్రమంజిల్ కాలనీ గేటుదగ్గరకి వచ్చేసింది. నా మనసు కుదుటపడసాగింది. దగ్గరలోకి వచ్చేస్తున్నాను అన్నట్లుగా.

ఆటో ఆగిపోయింది.

"అమ్మా దిగండి. మీ ఏరియాలోకి వచ్చేశారుగా. ఇంక మీకేం భయంలేదు.నేను మిమ్మల్ని ఇంటివరకూ దింపాలనే అనుకున్నాను. కానీ నేను త్వరగా ఇంటికి వెళ్లిపోవాలి' అంటూ మీటర్ చూసి చెప్పాడు "పదిహేను రూపాయలు అయిందమ్మా"

నేను ఆటోదిగి పర్స్ తెరిచి యాభైరూపాయల కాయితం తీసిఇచ్చాను."

"బాబూ! నన్ను జాగ్రత్తగా తీసుకువచ్చి నందుకు... "మిగతా మాటలు మింగేశాను.

చిల్లర లెక్కపెట్టి ఇవ్వబోయాడు. నామాటని విన్పించుకున్నట్టు లేదు.

"ఒద్దుబాబూ" అన్నాను కృతజ్ఞతగా చూస్తూ.

అతను చిన్నగా నవ్వాడు.

"అమ్మా నేనూ అంత మంచివాడిని కాను. కానీ ఈరోజు నా పదహారేళ్ళ కూతుర్ని స్కూలునుంచి వస్తూంటే ఓ రౌడీవెధవ కిడ్నాప్చేసితీసుకుపోతూంటే ఆ రోడ్డుమీద పోతున్న ఎందరో మాకెందుకన్నట్టుగా చూస్తూ నిల్చిపోయారు. కానీ ఓ డెబ్భైయ్యేళ్ళ ముసలాయన ప్రాణాలకి తెగించి నా బిడ్డని రక్షించి నా ఇల్లుచేర్చాడు. ఆయనకి చాలా దెబ్బలు తగిలినాయి. ఆసుపత్రిలో చేర్చి ఇంటికిపోతూ చిక్కడపల్లిలో ఆగాను. నా ఇంటివైపు ఎవరన్నా వస్తేతీసుకువెడదాం అని. ఆలోచిస్తూ ఆటోలో కూర్చున్నాను. మాటిమాటికీ ఆ ముసలాయనే నా మనసులో మెదులుతున్నాడు. నాకివాళే తెల్సిందమ్మా "మానవత్వపు విలువ" అతని కళ్ళల్లో నీటిపొర కదిలింది. అది చూశాకే నామనసు సుద్ధి అయింది అందుకే...

అపాయంలో ఉన్న మిమ్మల్ని ఇల్లు చేర్చాలనే మంచిబుద్ధి పుట్టింది. మీరు జాగ్రత్తగా వెళ్లండమ్మా" అంటూ అతను ఆటో ఎక్కాడు.

నేను అతని మాటలకి స్థాణువులా అయి కోలుకుంటూ "బాబూ ఆ ఆటోలోని దుర్మార్గులు ముగ్గురూ... నిన్నేమైనా చేస్తారేమో! మరోదారిలో వెళ్ళుబాబూ" ఆత్మీయత నిండిన నా మాటలకి అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పెదవులు బిగబట్టి నవ్వి "మావి

రోడ్డుమీది బ్రతుకులమ్మా. ఇవాళకాకున్నా రేపైనా తప్పదు వాళ్ళని ఎదుర్కోవాలి. అందుకని వాళ్ళని చూసుకుని ఆసుపత్రికి వెళ్లి రాత్రికి ఆ ముసలాయన దగ్గర ఉండాలి.

అదీకాక నాభార్య నాకోసం ఎదురుచూస్తూ వాకిట్లోనే నిల్చుని వుంటుంది. మీరు త్వరగా ఇల్లుచేరండమ్మా" అంటూ వుండగానే ఆటో వెళ్ళిపోయింది.

మానవత్వం పరిమళించినవేళ భయంపోయి యేదో తెలియని ఆనందం మనసంతా ఆక్రమించేసింది. ఆ ఆనందంలో విషాదమూ వుంది. నన్ను దించిన ఆటోడ్రైవరుని ఆ దుర్మార్గులు ముగ్గురూ యేంచేయరుగదా! ఆటోడ్రైవర్ కూతుర్ని రక్షించిన ముసలాయన గాయాలనుంచి కోలుకుంటాడుకదా!

భగవంతుడా! ఆ ఇద్దరినీ రక్షించు అని ప్రార్థించటం తప్ప ఇంకేం చేయగలను అనుకుంటూ ఇంటివైపుగా నడవసాగాను. దూరంగా శ్రీవారు నావైపే వస్తూ కన్పించారు.

*(ఈనాడు ఆదివారం 20 జూన్ 1993)*